సాక్షి
ఖమ్మం
గురువారం । 7 । మార్చి । 2024



తాగునీటి సమస్యపై దృష్టి

కూసుమంచిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై దృష్టి సారించినట్లు అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. 8లో



400 బస్తాల బియ్యం స్వాధీనం

బోనకల్ మండలం రావినూతల మీదుగా తరలిస్తున్న 400 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం వాతావరణం కాస్త చల్లగానే ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

ప్రమాద ఘంటికలు

జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

- ఎండలు ముదిరే కొద్ది మరింత కష్టం
- ఫిబ్రవరిలోనే 6.22 మీటర్ల లోతులోకి నీరు
- వేసవిలో తాగునీటికి కూడా తిప్పలే?
- ముందస్తు చర్యలపై యంత్రాంగం కసరత్తు



నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో అడుగంటిన బావి

జిల్లాలో భూగర్భ జలాలు అంతకంతకూ కిందకు పడిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే నీరు పాతాళానికి పడిపోగా... మండువేసవిలో మరింత గడ్డు పరిస్థితి ఎదురయ్యే ప్రమాద ముంది. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే జలవనరులు ఆవిరయ్యాయి. సాగు, తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తుండడంతో సర్కారు సమస్య తీవ్ర తను గుర్తించి ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. నీటి ఎద్దడి ఎదురు కాకుండా తీసు కోవాల్సిన చర్యలపై జల వనరుల శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సమీక్షించారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

20 ఏళ్లలో మొదటిసారి ఎండిన బావి..



నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి చెందిన పోలంపల్లి జాన్‌కు మూడె కరాల వ్యవసాయ భూమి ఉంది. గత 20 ఏళ్ల క్రితం ఆయన పొలంలో బావిని తవ్వించగా.. ఆనాటి నుంచి బావి నీరు ఆధారంగా రెం డు పంటలు సాగు చేస్తున్నాడు. ఇరవై ఏళ్ల లో ఎప్పుడూ కూడా ఎండిపోని బావి ఈసారి అడుగంటింది. దీంతో మూడెక రాల్లో వరి పంట ఎండిపోతోంది. ఇప్ప టికే అరెకరం పూర్తిగా ఎండిపోగా, పెట్టు బడి రూ.90వేలు చేతికొచ్చే పరిస్థితి లేదని జాన్ ఆవేదన చెందుతున్నాడు. పంటను బతికించుకోవాలని సమీప రైతుకు చెం దిన బావి నుంచి పైప్‌లైన్ల ద్వారా నీరు తీసుకొస్తున్నా ఆశలు ఫలించే పరిస్థితి లేదని చెబుతున్నాడు.

పాతాళానికి గంగ

ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కుర వకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. గత ఏడాది వేసవిలో అకాల వర్షాలు కురవడంతో భూగర్భ జలాల్లో తగ్గుదల కనిపించలేదు. గత ఫిబ్ర వరిలో 5.11 మీటర్లు, మార్చిలో 5.15 మీటర్ల వద్ద నీరు ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 6.22 మీటర్ల లోతుల్లోకి పడిపోయింది. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో 1.11 మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోగా.. బోర్లు, బావులు ఎండి పోతున్నాయి.



నీరు లేక ఎండిపోయిన పొలం

అన్ని మండలాల్లోనూ అంతే..

జిల్లాలోని 21 మండలాల్లో మూడు మినహా మిగిలిన చోట్ల గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది గం గమ్మ పాతాళానికి వెళ్లింది. మధిరలో 0.07 మీటర్లు, ఎర్రుపాలెంలో 1.05 మీటర్లు, వైరాలో 0.48 మీటర్ల మేరకు జలాలు పైకి వచ్చాయి. మిగిలిన 18 మండ లాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. చింతకాని మండలంలో గత ఏడాది ఫిబ్రవరిలో 2.48 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.38 మీటర్ల లోతుకు పడిపోయింది. అంటే 2.90 మీటర్ల మేర భూగర్భ జలాలకు కిందకు పడిపో యాయి. కామేపల్లి మండలంలో గత ఫిబ్రవరిలో 8.11 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 10.23 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇదే పరిస్థితి 18 మండలాల్లో ఉంది.

సాగు, తాగునీటి కష్టాలు

యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి వసతి లేక నిలువునా ఎండిపోయాయి. పంట భూముల న్నీ నెర్రెలిచ్చాయి. ఎగువన వర్షాలు కురవకపోవ డంతో సాగర్ నుంచి నీరు విడుదల చేయలేదు. ఈక్రమాన పాలేరు రిజర్వాయర్‌లో నీరు అడుగం టింది. జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి వసతి లేక.. బోర్లు, బావుల్లో నీరు ఇంకిపోవడంతో పంటలకు అందడం లేదు. ఇక కొన్ని ప్రాంతాల్లో బోర్లు వేసినా పరిస్థితి ఆశాజనకంగా లేక రైతులు నష్టపోయారు. పాలేరు పాత కాల్వకు నీరు విడు దల చేయాలని రైతులు ఇప్పటికే పలుమార్లు ఆం దోళనలు చేశారు. అయినా ఫలితం లేక పంటలు చేతికి రావడం కష్టమేనని చెబుతున్నారు. ఇక తాగు నీటికి సైతం తీవ్ర ఇక్కట్లు తప్పవని అధికారులు అంచనాకు వచ్చారు. పాలేరు రిజర్వాయర్‌లో ఉన్న నీరు ఈనెల 15 వరకు సరిపోనుండగా.. ఆ తర్వాత సాగర్ నీరు వస్తేనే ఫలితముంటుంది.

సమీక్షించిన మంత్రి

జిల్లాలో నీటి ఎద్దడి, ప్రత్యామ్నాయ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యవసాయ, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిం చారు. తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. బేతుప ల్లి, బోడెపూడి, ఎన్నెస్పీ ద్వారా నీరు సమకూర్చు కుంటే భూగర్భ జలాలు పెరిగే అవకాశముందని తెలిపారు. రానున్న నాలుగు నెలలు ఇబ్బంది ఎదు రుకాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

గత ఏడాది, ఈ ఏడాది ఫిబ్రవరిలో భూగర్భ జలాల లభ్యత (లోతు.. మీటర్లలో)

మండలం	2023	2024
చింతకాని	2.48	5.38
కామేపల్లి	8.11	10.23
వేంసూరు	5.06	6.87
బోనకల్	1.35	3.14
తల్లాడ	2.72	4.44
పెనుబల్లి	4.26	5.95
ముదిగొండ	1.40	3.05
ఏన్కూరు	7.93	9.51
నేలకొండపల్లి	2.51	3.75
సింగరేణి	5.60	6.81

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- వీ.వీ.పాలెం రైతు వేదికలో వీసీ ప్రారంభం



సీఎం ప్రసంగాన్ని వింటున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

రఘునాథపాలెం: రైతులకు సస్యరక్షణ చర్యలే కాక సాగులో మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిం చేందుకు రాష్ట్రప్రభుత్వం రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటుచేస్తోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. 'రైతు నేస్తం' పేరిట ఇచ్చే సలహాలను అన్నదాతలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. జిల్లా లోని ఐదు రైతు వేదికల్లో మొదటి దశగా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటుచేయగా హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రా తుమ్మల నాగేశ్వర రావు బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈమేరకు రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి హాజరైన కలె క్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా పంటల సాగు, ఆధునిక వంగడాలు, సస్యరక్షణ చర్యలపై వారానికి రెండు రోజులు శాస్త్రవేత్తలు వీసీ ద్వారా వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏఓ విజయనిర్మల, డీసీఓ వి.మురళీధర్ రావు, డీపీఓ హరికిషన్, ఫిషరీస్ ఏడీ ఆంజనేయశర్మ, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డితో పాటు యరగర్ల హన్మంతరావు, తాతా రఘురాం, గుత్తా రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సమర్పించండి

రాజీవ్ స్వగృహ(జలజ టౌన్‌షిప్) ఆస్తుల కచ్చిత మైన ధరపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు కలె క్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో నిర్మించిన రాజీవ్ స్వగృహ లో అసం పూర్తిగా ఉన్న ఎనిమిది టవర్లు, ఖాళీస్థలం విలువను నిర్ధారించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉందన్నారు. ఈసమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, రాజీవ్ స్వగృహ ఎస్‌ఈ సి.భాస్కర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యాంప్ర సాద్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పద్మ, ఆర్డీఓ జి.గణే ష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ పార్లమెంటరీ స్థాయి సమీక్ష

- హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్సీ తాత మధు



మాట్లాడుతున్న తాత మధుసూదన్, పక్కన కూరాకుల, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధ తపై సమీక్షించడమే కాక శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు సూదన్ వెల్లడించారు. ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరవుతున్నందున పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధు లు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. అలాగే, సాయంత్రం 4 గంటలకు బైపాస్‌లో కేసీఆర్‌కు కృత జ్ఞత సభ, వద్దిరాజు రవిచంద్రకు అభినందన సభ ఏర్పాటు చేసినట్లు మధు తెలిపారు. ఈ వేదికల పైనుండి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తా మని ఆయన పేర్కొన్నారు.

వాగ్దానాల అమలేది?

ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన సంద ర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు చూస్తే ఏక్‌నాథ్ షిండే మాదిరి కనిపించారని తాతా మధు పేర్కొన్నారు. గతంలో మహారాష్ట్ర, అసోంలో ఇలాగే మాట్లాడిన వారు పార్టీ మారి మోదీకి మద్దతు పలికారని గుర్తు చేశారు. కాగా, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి 80 రోజులు దాటినా వాగ్దానాలు అమలు చేయలేదని, మూడెకరాల పైన భూమి ఉన్న రైతు లకు రైతు బంధు ఇవ్వలేదని విమర్శించారు. అసెం బ్లీ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ కాంగ్రెస్ నేతల మాటలు నమ్మితే నీళ్ల ట్యాంకులు తిరుగుతాయని చెప్పగా.. ఖమ్మంలో ఇప్పుడు అదే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, ఖమర్, ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగ డాల నరేందర్ పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు



రైతులు, అధికారులతో సమీక్షిస్తున్న ఎండీ కేశవులు

ఖమ్మంవ్యవసాయం: రైతులు విత్తనోత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సం స్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.కేశవులు సూచించారు. ఖమ్మంలోని విత్తనోత్పత్తి క్షేత్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. నేలకొండపల్లి మండలం రాజుపేటలో వరి, తిరుమలాయపాలెం మండలం బీరోలులోని పెసర విత్తనోత్పత్తి క్షేత్రాలతో పాటు ఆరెంపుల, రఘునాథపాలెంలలో విత్తనాభివృద్ధి సంస్థ గోదాములను ఆయన సందర్శించారు. ఆ తర్వాత ఖమ్మంలోని ఉమ్మడి జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో రైతులతో సమావేశమైన కేశ వులు మాట్లాడారు.. విత్తనోత్పత్తిలో ప్రధానంగా కేళీలు, కలుపుపై దృష్టి సారించాలని సూచించారు. సంస్థ సూచనలు, సలహాలను పాటిస్తూ క్షేత్రాలను నిర్వహిస్తే, నాణ్యమైన ఫలితాలు వస్తాయని తెలి పారు. నాణ్యమైన విత్తనాలను సంస్థకు అందించి ఆదర్శవంతంగా నిలవాలని రైతులను కోరారు. ఆ తర్వాత విత్తన గోదాంల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ ఎస్.భిక్షం, మేనేజర్లు జె.సంధ్యారాణి, ఎస్.భాస్కర్, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరిగి ఉద్యోగాల్లోకి జీడీఎస్‌లు

ఉమ్మడి జిల్లాలో 256 మందికి ఊరట

ఖమ్మంగాంధీచౌక్: నిబంధనలు ఉల్లంఘించారని ఉద్యోగాల నుంచి తొలగించబడిన గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్)ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర తపాలా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమే రకు హైదరాబాద్ సర్కిల్ అధికారుల ఆదేశాలతో బుధవారం ఖమ్మం డివిజన్ పరిధిలో ప్రక్రియ ప్రారంభించారు. సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో జీడీఎస్‌ల జేఏసీ గత ఏడాది డిసెంబర్ 12నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునివ్వ గా, జిల్లాలోని ఉద్యోగులు విధులు బహిష్కరించి పాల్గొన్నారు. అయితే, మూడేళ్ల సర్వీస్ పూర్తయ్యే వరకు సమ్మెలో పాల్గొనొద్దనే నిబంధనను అతిక్ర మించారంటూ ఉమ్మడి జిల్లాలో 256 మంది జీడీ ఎస్‌లను అప్పట్లో తొలగించారు. అయితే, వీరిని తిరిగి ఉద్యోగాలకు తీసుకోవాలని కేంద్ర తపాలా శాఖ నిర్ణయించగా, తొలి దశలో పది మందికి ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.ర వికుమార్ బుధవారం సమాచారం ఇచ్చారు. వీరు గురువారం విధుల్లో చేరాలని సూచించగా.. దశల వారీగా మిగతా వారిని కూడా ఉద్యోగాల్లోకి తీసు కోనుండడంతో జీడీఎస్‌ల్లో ఆనందం వ్యక్తమ వుతోంది.

ఐక్య పోరాటాలే తక్షణ కర్తవ్యం

- ఫాసిస్ట్ పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతల ప్రకటన
- మహాసభల్లో ఆరు తీర్మానాల ఆమోదం, జాతీయ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సుభాష్‌దేవ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మూడు విప్లవ పార్టీల కల యికతో ఏర్పడిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ద్వారా ఐక్య పోరాటాలే తక్షణ కర్తవ్యంగా ముందుకు సాగు తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సిం గ్ ఠాగూర్, సంయుక్త కార్యదర్శులు పోటు రంగా రావు, సుభాష్‌దేవ్ వెల్లడించారు. ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం వారు మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడే క్రమాన ప్రజా పోరాటాలకు కేంద్రమైన ఖమ్మంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సభలు విజయ వంతమయ్యాయని పేర్కొన్నారు. అన్ని ఫాసిస్ట్ వ్యతిరేక శక్తులతో కలిసి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడిం చాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు నూతన ప్రజాస్వా మిక విప్లవం, పార్టీ రాజ్యాంగం, రాజకీయ తీర్మానం తదితర ఆరు అంశాలను చర్చించి ఆమోదించినట్లు వెల్లడించారు. కాగా, ఐక్యతా మహాసభలు విజయ వంతానికి సహకరించిన అందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ కమిటీ ఏర్పాటు..

మాస్‌లైన్ సెంట్రల్ కమిటీని 21 మందితో ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. అలాగే తొమ్మిది మంది సభ్యులతో పొలిట్‌బ్యూరో, ముగ్గురు సభ్యుల తో కంట్రోల్ కమిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రదీప్ సింగ్ ఠాకూర్(పశ్చిమ బెంగాల్) ప్రధాన కార్యదర్శిగా, పోటు రంగారావు (తెలంగాణ), సుభాష్ దేబ్(త్రిపుర) సంయుక్త కార్య దర్శులుగా ఎన్నికయ్యారని, కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా రాయల చంద్రశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు.

ఆమోదించిన తీర్మానాలివే..

మహాసభల్లో ఆమోదించిన పలు తీర్మానాలను నేత లు వివరించారు. ఇజ్రాయిల్ చేసిన మారణహోమ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలతో కలిసి నిలబడాలని, మణిపూర్‌లో ఫాసిస్ట్ బీజేపీ–ఆర్ ఎస్ఎస్ చేసిన హింసను ఖండించాలని, జీఎన్.సా యిబాబాతోపాటు ఇతరులపై కేసును ముంబై కోర్టు కొట్టివేసిన నేపథ్యాన భారత ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తీర్మానించినట్లు చెప్పారు. అలాగే, సమాజంలోని శ్రామిక, కర్షకులు, అణగారిన వర్గాల వారి పోరాటాలకు అండగా నిలవాలని నిర్ణ యించగా, యూఏపీఏ, ఏఎఫ్ఎస్పీఏ వంటి చట్టాలను వ్యతిరేకించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇం కా ఈ సమావేశంలో కే.జీ.రాంచందర్, కె.రమ, అలేక్ చక్రవర్తి, దేవవ్రత శర్మ, దినేష్ గోహైన్, సంజయ్‌సిం గ్వీ, కెచ్చెల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాయల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం తెలంగాణ.. నివాసం ఏపీ

- కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- ఏపీలోని విస్సన్నపేటలో ప్రైవేట్ క్లినిక్ నిర్వహణ
- సీతారాంపై అక్కడి పీఎస్‌లో కేసు నమోదు
- గతంలో సత్తుపల్లిలోనూ ఓ వైద్యురాలితో అనుచిత ప్రవర్తన?



సత్తుపల్లిలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం

సత్తుపల్లి: అందరి విధులను పర్యవేక్షించాల్సిన అధికారే.. ఇతర రాష్ట్రం నుంచి చుట్టపుచూపుగా రాక పోకలు సాగిస్తుండగా.. లైంగిక వేధింపుల ఆరోప ణలతో ఆయనపై కేసు నమోదు కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తలారి సీతారాం సత్తుపల్లి కేం ద్రంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండల కేం ద్రంలో కీర్తన ఆస్పత్రి నడుపుతూ ఇక్కడకు వచ్చివె ళ్తున్నాడు. పదిహేనేళ్లుగా ఆయన అక్కడే నివాస ముంటూ తెలంగాణలో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పని చేస్తున్న ప్పుడు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయొద్దనే నిబంధన ఉన్నా బేఖాతర్ చేయడంతో పాటు స్థానికంగా ఉండని ఆయనపై.. ఏపీలోని ఆస్పత్రిలో ఓ మహిళను లైం గికంగా వేధించిన ఆరోపణలతో కేసు నమోదైంది.

తనిఖీ చేయాల్సిన అధికారే..

డాక్టర్ తలారి సీతారాం గంగారం, వేంసూరు పీహె చ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్‌గా, పెనుబల్లిలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేయగా.. ఐదేళ్ల నుంచి కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీని పరిధిలో గంగారం, వేంసూరు, లంకాసాగర్, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు పీహెచ్‌సీలను ఆయన నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇటీవల సత్తుప ల్లిలో జరిగిన సమీక్షలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కల్లూరు, పెనుబల్లి వైద్యులు, సిబ్బం ది ఇతర ప్రాంతాల రాకపోకలు సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే రాగమయి చెప్పారని పేర్కొంటూ తీరు మార్చుకోకపోతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అయితే, వైద్యులు, సిబ్బంది మాటేమో కానీ వారిని పర్యవేక్షించాల్సిన అధికారే ఏపీ నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు బయటప డడం వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగులతో దురుసు ప్రవర్తన

కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తలారి సీతారాం వైద్యులు, సిబ్బందిపై దురుసుగా ప్రవ ర్తిస్తారనే ఆరోపణలు వెలుగు చూస్తున్నాయి. మహి ళా ఉద్యోగులతో ఆయన ప్రవర్తన అభ్యంతరకరం



తలారి సీతారాం

గా ఉంటుందని పేరు చెప్పడా నికి ఇష్టపడని కొందరు ఉద్యో గులు తెలిపారు. వైద్యులకు సైతం మర్యాద ఇవ్వరని, పెనుబల్లిలో పనిచేసినప్పుడు ఓ ఘటన వివాదంగా మారిం దని గుర్తు చేస్తున్నారు. అయితే, ఆయనపై ఫిర్యాదు చేయాలన్నా ఎక్కడ ఇబ్బంది పెడతారోనని భయం తో బయటకు రావడం లేదని సమాచారం. కరోనా సమయాన ఏపీ నుంచి రాకపోకలు సాగిస్తుండగా సరిహద్దులో పోలీసులతో జరిగిన వాగ్వాదం కేసుల వరకు వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల డివిజన్‌లోని ఓ వైద్యురాలితో అనుచితంగా ప్రవర్తించగా స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీతారాం పై విచారణ జరిపిస్తే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

సమాచారం తెలిసింది...

కల్లూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ తలారి సీతారాంపై ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు అయినట్లు పత్రికల ద్వారా సమాచారం తెలిసింది. పోలీసుల నుంచి లిఖిత పూర్వకంగా ఎటువంటి సమాచారం రాలేదు. విస్సన్నపేటలో ఆస్పత్రి నడుపుతున్నట్టు, డివిజన్‌లోని ఉద్యోగులపై అనుచిత ప్రవర్తన తన దృష్టికి రాలేదు.
– డాక్టర్ వి.సుబ్బారావు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

న్యూస్‌రీల్

వద్దిరాజును సత్కరించిన ఎంపీ బండి



రవిచంద్రను సత్కరిస్తున్న పార్థసారధిరెడ్డి, బాజిరెడ్డి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభకు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచం ద్రను ఎంపీ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి సన్మా నించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కాల నీలోని వద్దిరాజును బుధవారం కలిసిన పార్థ సారధిరెడ్డి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకుడు గాలి అనిల్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తుందని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. అర్హత కలిగి విదేశాల్లో చదువుకునేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ దేశాల్లో చదువుకునేందుకు వెళ్లే వారు అర్హులని, వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులందరికీ ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న డీఈఓ శర్మ

రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఎస్సెస్సీ విద్యార్థులతో పాటే 6నుండి 9వ తర గతి విద్యార్థులకు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. రఘునాథపాలెంలోని హైస్కూ ల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా 8, 9వ తరగతుల విద్యార్థుల ప్రగతిని పరిశీలించగా పలువురు వెనుకబడి నట్లు గుర్తించారు. ఈ మేరకు డీఈఓ మాట్లా డుతూ విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యా యులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే, ఈ విధానం జిల్లావ్యా ప్తంగా అమలుచేయాలని ఆయన పాఠశాలల హెచ్‌ఎంలను ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా ఆదేశిం చారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పంటల నమోదును పరిశీలించిన డీఏఓ



వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ, ఉద్యోగులు

కారేపల్లి: మండలంలోని కొత్తతండా, లాల్‌తం డా గ్రామాల్లోని పోడు భూముల్లో సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తుండ గా, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల పరిశీలించారు. బుధవారం పంటల నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆమె పెసర పంటలో పేనుబంక, మారుక మచ్చల పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ కె.ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసా గుతున్నాయి. బుధవారం ప్రథమ సంవత్సరం పరీక్షలు జరగగా, 17,992మంది విద్యార్థులకు గాను 17,290మంది హాజరయ్యారు. జిల్లా కేం ద్రంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠ శాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తనిఖీ చేశారు. అలాగే, హెచ్‌పీసీ, డిఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 37కేంద్రా లను తనిఖీ చేశాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన ఎంపీ నామ


కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వర రావు హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా 15న జరగనున్న తన రెండో కుమారుడు భవ్య తేజ – శేష మనోజ్ఞజ్యోతి వివాహానికి హాజరుకావాలని కోరుతూ వివాహపత్రిక అందజేశారు. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును కూడా ఆహ్వానించారు. నామ వెంట ఆయన కుమారులు పృథ్వీతేజ, భవ్యతేజ ఉన్నారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న శ్రీరామ్

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగుల ఎంపికకు నిర్వహించిన మేళాకు 36 మంది హాజరుకాగా, 22 మందిని ఎంపిక చేశారు. జాబ్‌మేళాను జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ పర్యవేక్షించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

ఖమ్మం అర్బన్: ఖమ్మం ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను చింతకాని మండలం రామకృష్ణాపురం, ధంసలాపురం గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ధంసలాపురం వద్ద హైవేకు ఎగ్జిట్ పాయింట్(సర్వీసు రోడ్డు) ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీంతో కొన్నాళ్లు పనులు నిలిపివేసిన అధికారులు మళ్లీ మొదలుపెట్టారు. ఈమేరకు గ్రామస్తులు అడ్డుకున్నారు. భవిష్యత్‌లో ఇబ్బంది ఎదురుకాకుండా సర్వీస్‌రోడ్డు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, వాకా సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యువజన నాయకుడు అరెస్ట్

ఖమ్మంక్రైం: బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు దేవభక్తుని కిశోర్‌బాబును బుధవారం ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది ఖమ్మంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఓ కార్యక్రమాన్ని వీడియో తీస్తున్న కార్తీక్‌ను కులం పేరుతో దూషించడమే కాక కిశోర్‌తోపాటు మరికొందరు దాడి చేశారు. ఈ ఘటనపై అప్పట్లో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. దాడికి పాల్పడిన కొందరిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న కిశోర్‌తో పాటు ప్రదీప్‌ను బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం నగర ఏసీపీ కార్యాలయానికి తరలించి విచారణ తర్వాత కోర్టులో హాజరుపరిచారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం

వైరా: కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో వాహనం దెబ్బతినగా తృటిలో పెనుప్రమాదం తప్పినట్లయింది. స్థానికుల కథనం ప్రకారం.. తిరుమల వెళ్లి వస్తున్న పలువురు బుధవారం కారులో వైరా మీదుగా కరీంనగర్ వెళ్తున్నారు. వైరా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని కారు ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించగా.. ముందు వాహనాలు ఉండడంతో కార్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక లారీ ఢీకొట్టగా కారు ధ్వంసమైంది. ఈ సమయాన కారులో ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురు ఉండగా, స్వల్ప గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బిల్లులు చెల్లించకపోతే పనులు నిలిపేస్తాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎంజీఎఫ్, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులే కాక ఎన్నికల పనులకు సంబంధించి రూ.35 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ల అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ మేరకు బిల్లులు చెల్లించకపోతే 13వ తేదీ నుంచి అన్ని పనులు నిలిపేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను బుధవారం కలిసిన వారు బిల్లులు ఇప్పించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, జోగల్ కిశోర్, శ్రీహరిరాజు, బి.సతీశ్, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

400 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బోనకల్: మండలంలోని రావినూతల మీదుగా లారీలో అక్రమంగా తరలిస్తున్న 400 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మధుబాబు కథనం మేరకు.. జగ్గయ్యపేట నుంచి రాజమండ్రికి వెళ్తున్న లారీని తనిఖీ చేయగా 400 బస్తాల్లో ఉన్న సుమారు 20 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్ షేక్ మస్తాన్, యజమాని షేక్ ఇనాయతుల్లా, ఆర్గనైజర్ ఆత్మకూరు జగదీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారేపల్లి మండలంలో 22 క్వింటాళ్లు..

కారేపల్లి: మండలంలోని కొమ్ముగూడెం నుంచి తరలిస్తున్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కొమ్ముగూడెంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన బియ్యాన్ని కల్తీ బాలకృష్ణ వాహనంలో తరలిస్తుండగా ఎస్‌ఐ రాజారాం, ఆర్‌ఐ జార్జి చేరుకుని సీజ్ చేశారు. ఈ ఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్య నివారణపై దృష్టి


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

కూసుమంచి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. కూసుమంచిలో తాగునీటి ఇబ్బంది నివారణకు చర్యలు చేపట్టాలన్నాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో బుధవారం అదనపు కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా పాలేరు నుంచి తాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నా రిజర్వాయర్‌లో నీరు తగినంత లేనందున ప్రత్యామ్నాయాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలతతో చర్చించారు. ఆ తర్వాత కూసుమంచికి తాగునీరు సరఫరా చేసేందుకు అనువుగా ఉన్న బావులు, బోర్లను అద్దెకు తీసుకునేందుకు గాను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాదాసు ఉపేందర్, ఎంపీఓ రాంచందర్‌రావు, గ్రామ కార్యదర్శులు శంకర్, నరేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల అక్రమాలపై స్పందించని పశువైద్యులు

నోటీసులకు సైతం సమాధానం కరువు

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకంలో జరిగిన అక్రమాలపై సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేయగా పలువురు పశువైద్యాధికారుల నుంచి స్పందన కరువైంది. 2017–18 సంవత్సరంలో గొర్రెల పథకంలో అక్రమాలు జరిగిన విషయాన్ని 'కాగ్' గుర్తించింది. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అక్రమాలు జరిగినట్లు పేర్కొనగా, ఇందులో ఖమ్మం జిల్లా సైతం ఉంది. ఇక్కడ రూ.17 కోట్లకు పైగా నిధులు పక్కదారి పట్టాయని కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ఈ వ్యవహారంపై జిల్లాలో 32 మంది పశువైద్యాధికారులను బాధ్యులుగా చేర్చి, వారికి ఫిబ్రవరి మూడో వారంలో నోటీసులు జారీ చేసి వారంలోగా సమాధానం చెప్పాలని సూచించారు. అయితే, వీరిలో కొందరు ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తుండగా, ఇంకా కొందరు ఇతర జిల్లాల్లో ఉన్నారు. మరికొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేసి ఇతర శాఖల్లోకి వెళ్లినట్లు సమాచారం. మొత్తంగా ఏడు నుంచి ఎనిమిది పశు వైద్యాధికారులు ఇప్పటి వరకు జేడీ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. దీంతో రెండోసారి కూడా నోటీసులు జారీ చేసి సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ అంశంపై జేడీ వేణుమనోహర్‌రావును సంప్రదించగా నోటీసులకు సమాధానం ఇవ్వని వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైద్యం ఖర్చులు చెల్లించాల్సిందే...

ఖమ్మంలీగల్: ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి చికిత్సకు అయిన ఖర్చులన్నీ చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పునిచ్చారు. బుధవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం బిల్లుపాడుకు చెందిన మేడ సత్యనారాయణ స్టార్ హెల్త్ ఎల్లాయిడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా తన కుటుంబసభ్యులతో కలిసి 2023 మార్చిలో రూ.41,813 చెల్లించి రూ.15 లక్షల విలువైన బీమా పాలసీ తీసుకున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఆయన అనారోగ్యం బారిన పడగా ఖమ్మం, హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. ఈ మేరకు వైద్యం ఖర్చులు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా వారు నిరాకరించారు. దీంతో సత్యనారాయణ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా.. పరిశీలన అనంతరం వైద్య ఖర్చులు రూ.5,51,595, మనోవేదనకు గురి చేసినందుకు రూ.10 వేలతో పాటు ఖర్చుల కింద మరో రూ.10 వేలను 45 రోజుల్లోపు చెల్లించాలని తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుడి తరఫున వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్ న్యాయవాదిగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముదిగొండ: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని యడవల్లిలక్ష్మీపురంలో బుధవారం జరిగింది. కూసుమంచికి చెందిన పెంట్ర రాము ద్విచక్రవాహనంపై ముదిగొండ నుంచి కూసుమంచి వెళ్తుండగా యడవల్లిలక్ష్మీపురం నుంచి రాఘవాపురం వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఒకరికి గాయాలు

పెనుబల్లి: మండలంలోని రామచందర్‌రావుబంజర్‌లో యాదవ సంఘం ఎన్నికల సందర్భంగా ఇరువర్గాల నడుమ ఘర్షణ జరగగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రామచందర్‌రావుబంజర్‌లో బుధవారం యాదవ, కురుమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం కారులో వెళ్తున్న బలుసుపాటి రాంబాబును కొందరు కిందకు దించి రాళ్లు, కర్రలతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో యలమర్తి శ్రీను, వై.వెంకటేశ్వరరావు, కోమటి వెంకటేశ్వరరావు, రొంటి నర్సమ్మ, రొంటి శ్యామ్, ఓరుగంటి సాయి, ఇమ్మడి వెంకటేశ్వరరావు, రొంటి రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటేశ్ తెలిపారు. కాగా, పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబును ఎమ్మెల్యే రాగమయి పరామర్శించారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారానికి చెందిన రైతు బానోత్ లింగా (40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం తెల్లవారుజామున వరి పొలానికి నీరు పెడతానని వెళ్లిన ఆయన చేనులో గట్టుపై చెట్టుకు ఉరి వేసుకుని ఉండడాన్ని రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వారు వెళ్లేలోగా లింగా మృతి చెందాడు. కాగా, తన భర్తకు మద్యం అలవాటు ఉన్నందున మందలించటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన భార్య కమల ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తీర్థాల జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మంరూరల్ మండలం తీర్థాల శ్రీసంగమేశ్వర స్వామి ఆలయంలో జరిగే జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం నుంచి 9వ తేదీ వరకు బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ బస్సులు దానవాయిగూడెం, కామంచికల్ మీదుగా ఆలయం వద్దకు వెళ్తాయని, పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు.

స్నానాలలక్ష్మీపురానికి..

వైరా: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వైరా మండలం స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే భక్తుల కోసం మధిర డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ డి.శంకర్‌రావు తెలిపారు. వైరా పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా స్నానాల లక్ష్మీపురం వరకు ప్రతీ పది నిమిషాలకో బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: వరంగల్‌లో ఈ నెల 8 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఖమ్మం జిల్లా జూనియర్ బాలుర జట్టును ఎంపిక చేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు 48 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎం.గౌతమ్, సీహెచ్ నవీన్, పి.నివాస్, కె.ధర్మభిక్షం, సీహెచ్ ఉపేంద్ర, ఎం.శ్రీరామ్, సీహెచ్ రవికుమార్, పి.రామారావు, వై.భద్రు, ఎ.సురేశ్, కె.తిరుపతిరావు, బొల్లా సాయి, టి.చందు, ఎల్.సైదులు, సీహెచ్ ప్రేమ్‌కుమార్, సీహెచ్ వర్ధన్‌బాబు ఎంపిక కాగా, పోటీలను పాముల శ్రీను, చలమల కృష్ణయ్య, ప్రకాష్ తదితరులు పర్యవేక్షించారు.

బ్యాంకు ఉద్యోగి చేతివాటం

బీమా పేరిట రూ.2.75 లక్షల మళ్లింపు


బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

సత్తుపల్లి: పంట బీమా పేరుతో రైతుల ఖాతాల నుంచి రూ.2.75 లక్షల మేర చేతివాటం ప్రదర్శించిన బ్యాంక్ కాంట్రాక్టు ఉద్యోగి ఉదంతం వెలుగులోకి వచ్చింది. సత్తుపల్లి ఎస్‌బీఐ ఏడీబీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న సైదా వీరబాబు పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతా నుంచి ఇన్సూరెన్స్ పేరిట రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై పెనుబల్లి మండలం ఏరుగట్లకు చెందిన రైతులు బుధవారం బ్యాంక్ మేనేజర్ వేణు దృష్టికి తీసుకొచ్చారు. పంట రుణాల సమయాన ఏటా బీమా కట్టాలనే విషయం చెప్పకుండా ఖాతాల్లో నుంచి నగదు బదిలీ చేస్తున్నారంటూ చెప్పారు. ఇన్సూరెన్స్ పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగితో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు వసూలు చేశారని రైతులు ఫిర్యాదు చేయగా, విచారించి రికవరీ చేస్తామని మేనేజర్ చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అయితే, రుణం తీసుకున్నప్పుడు రైతు ఆమోదం ఉంటేనే బీమా నగదు మినహాయించుకుంటామని, లేనిపక్షంలో చేయాల్సిన అవసరం లేదని మేనేజర్ వివరించారు.

గతేడాది యాక్సిస్ బ్యాంక్‌లో..

గతేడాది డిసెంబర్‌లో సత్తుపల్లి యాక్సిస్ బ్యాంకు ఉద్యోగులు ప్రశాంత్, చెన్నారావు, సైదుల్‌రెడ్డి రూ.1.50 కోట్ల మేర చేతివాటం ప్రదర్శించిన విషయం విదితమే. ఈ కేసులో నిందితులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అయితే వారు తిరిగి కొంత నగదు చెల్లించినట్లు చెబుతున్నా.. ఖాతాదారుల నగదును వాడుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.